కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అబిడ్స్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ కేంద్ర ప్రభుత్వ పథకాలను యువత, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బాక్‌వర్డ్ క్లాసెస్ ఇండస్ట్రీ చాంబర్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు నారాయణ, కార్యవర్గ సభ్యులు ఆపూరి కృష్ణమూర్తి పేర్కొన్నారు. హిందూ జన జాగరణ వేదిక, బీఐసీసీఐలు సంయుక్తంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఆదివారం శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ముఖ్యంగా పీఎంజీపీ రుణాలు, ముద్రా రుణాలు, విశ్వకర్మ యోజన, స్టాండ్ అప్ ఇండియా రుణాలు, ఎడ్యుకేషన్ రుణాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంబంధిత బ్యాంకుల్లో కేంద్ర ప్రభుత్వ రుణాలపై పూర్తి వివరాలు తెలుపుతున్నారన్నారు. ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ మోదీ ప్రభుత్వ రుణాలు ఎలా తీసుకోవాలో పూర్తిగా వివరించారు. యువతకు, మహిళలకు ఈ రుణాలు ఎంతో ఉపయోగపడుతాయని వారన్నారు.

హిందూ ఆలయాల పరిరక్షణకు కృషి చేయాలి


పూజలు నిర్వహించిన మహంత్ శ్రీ యోగి ప్రశాంత్ దాస్‌జీ మహారాజ్

జియాగూడ: హిందూ ఆలయాలను పరిరక్షించడంతో పాటు అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టాలని పురానాపూల్ పంచాయితీ అకాడ బడా ఉదాసీన్ మహారాజ్ మహంత్ శ్రీ యోగీ ప్రశాంత్ దాస్‌జీ మహారాజ్ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి జియాగూడలోని సనాతన హిందూ ఆలయాల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర చైర్మన్ పుట్టి యాదగిరి ముదిరాజ్, అధ్యక్షుడు టి.యమన్‌సింగ్, కోశాధికారి సీహెచ్. కాశిబుగ్గ బాబన్న ఆధ్వర్యంలో ఏర్పాటైన హనుమాన్ చాలీసా పఠనం, రామనామ జయకీర్తనల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మహంత్ శ్రీ యోగి ప్రశాంత్‌దాస్‌జీ మహారాజ్ మాట్లాడుతూ..ప్రతి శనివారం హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమం చేపట్టడం వల్ల ఎంతో జాగృతి కలుగుతుందని హైందవ ఆలయాలలో హనుమాన్ చాలీసా పఠనం విధిగా చేపట్టనున్నారు. చివరగా అయోధ్య రామ మందిర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి నగరం నుంచి కాలి నడకన బయలుదేరిన యువకులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ఆలయాల పరిరక్షణ సమితి నగర ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్, కార్వాన్ నియోజకవర్గం అధ్యక్షుడు చిలుకల చంద్రశేఖర్, జుగల్ కిశోర్, మోహన్‌చారి, పి.రాజు, గోపాల్, పాలెం వెంకటేష్, కె.నర్సింగ్‌రావు, ప్రవీణ్ ముదిరాజ్ మహేష్, నవీన్ ముదిరాజ్, రాజేష్, పవన్ యాదవ్ పాల్గొన్నారు.

తెలంగాణ మత్స్యకార పారిశ్రామిక చైర్మన్‌గా సాయికుమార్



అబిడ్స్: తెలంగాణ మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘాల సమైక్య చైర్మన్‌గా మెట్టు సాయికుమార్ నియమితులయ్యారు. బోయిగూడ ఆగాపురా ప్రాంతానికి చెందిన మెట్టు సాయికుమార్‌ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నం చేసిన సాయికుమార్‌కు టికెట్ రాకపోవడంతో పార్టీ పటిష్టతకు కృషి చేశారు. అప్పుడే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాయికుమార్‌కు భరోసా ఇచ్చారు. పార్టీ గుర్తిస్తుందని ఆయనకు చెప్పిన మాట ప్రకారం మత్స్యశాఖ చైర్మన్‌గా నియమించారు. యువజన కాంగ్రెస్ నాయకుడిగా గత 20 ఏళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిన మెట్టు సాయికుమార్ పదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకున్నా బీఆర్ఎస్ ప్రభుత్వం పై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. తనకు చైర్మన్ పదవి అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

‘రంజాన్ మాసం ఎంతో పవిత్రమైంది’


హకీంపేట్‌లో జరిగిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని నానల్‌నగర్ హీకంపేట్‌లోని ఏక్‌మినార్ మసీద్ ఖతీబ్ మహ్మద్ ఆఫేజ్ అబ్దుల్ రహమాన్ అన్నారు. ఆదివారం మజీద్ వద్ద ఇఫ్తార్ కార్యక్రమం నిర్వహించారు. ఇఫ్తార్‌కు ముందు ఆయన కార్యక్రమంలో పాల్గొన్న వారిని ఉద్దేశించి మాట్లాడారు. రోజా ఉండడానికి వయస్సు, ఆడామగతో సంబంధం లేదని అన్నారు. ఏడేళ్ల పైబడ్డ పిల్లలు సైతం పెద్దల పర్యవేక్షణలో ఉపావాస దీక్షలు ఆచరించాలని ఆయన అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు సైతం ఉపవాస దీక్షలు ఆచరించాల్సిందేనని ఆయన అన్నారు. తరావీ ప్రార్థనలకు కూడా ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. కేవలం రంజాన్ నెలలోనే జరిగే తరావీ ప్రార్థనలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫారాన్, ఆలీముద్దీన్, అజీజ్‌ఖాన్ పఠాన్, జుబేర్ బిన్ అవద్, మిర్జా ఎక్బాల్ అహ్మద్ పాల్గొన్నారు.

‘పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగల మద్దతు బీజేపీకే’


సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పీ నాయకులు

గౌలిపురా: పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగల మద్దతు బీజేపీకే ఉంటుందని ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పీ జాతీయ నాయకులు కుమ్మరి సత్యనారాయణ, వీఎస్ రాజు మాదిగలు అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం గౌలిపురాలోని ధన్‌రాజ్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ జరగాలంటే మరొక్కసారి నరేంద్ర మోదీ ప్రధాని కావాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో అన్ని పార్టీలు హామీ ఇచ్చినప్పటికీ, వర్గీకరణ మాత్రం చేయలేదన్నారు. బీజేపీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు ప్రకటించడమే కాకుండా సుప్రీంకోర్టులో ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం ఏర్పాటు చేసి వర్గీకరణపై చొరవ చూపుతుందన్నారు. ఎంఎస్‌పీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఇన్‌చార్జి రమేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకులు దార్ల యాదగిరి, గడ్డం లక్ష్మణ్, ముక్కల రమేష్, ఆర్.రవి మాదిగ, నర్సింహా రావు, దయానంద్, శంకర్, జగదాంబ, రాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం


రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

గోల్కొండ: గోల్కొండ, టోలిచౌకీ డివిజన్లలో పారిశుద్ధ్య పనులు అస్తవ్యస్తంగా మారాయి. ఎప్పుడు ఎక్కడ చెత్తను తరలిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో చెత్త కుప్పల నుంచి దుర్గాంధాన్ని వెదజల్లుతోంది. గోల్కొండ మోతీ మహల్ చౌరస్తా, సంగ్లిళ్లా స్కూల్, మోతీదర్వాజా, బంజారి దర్వాజా తదితర ప్రాంతాల్లో చెత్త కుప్పలు దర్శనం ఇస్తున్నాయి. చెత్తను ఏరే రిక్షా కార్మికులు సైతం చెత్తను రోడ్ల పక్కనే పారబోస్తున్నారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద, వాటి పక్కన చెత్త కుప్పల నుంచి దుర్గాంధం వస్తుంది. ట్రాఫిక్ సిగ్నల్స్ పడ్డప్పుడు చెత్త నుంచి వచ్చే దుర్గాంధాన్ని భరించలేక పోతున్నామని పలువురు వాహనాదారులు అంటున్నారు. గోల్కొండలోని రేశం బాగ్‌లో కూడా ఇదే దుస్థితి నెలకొని ఉంది. పారిశుద్ధ్య అధికారులు ప్రతినిత్యం క్రమం తప్పకుండా తమతమ ప్రాంతాల్లో పర్యటించి చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చారిత్రక స్థలాలు.. కబ్జాదారుల పాలు!


కనుమరుగువుతున్న చారిత్రక కందకాలు


మోతీదర్వాజా కందకాన్ని మట్టితో చదును చేసి పార్కింగ్‌కు ఉపయోగిస్తున్న దృశ్యం

గోల్కొండ: చారిత్రక గోల్కొండ కందకాలను పట్టించుకునే వారే కరువయ్యారు. గోల్కొండ కోట ప్రహరీ చుట్టూ ఉన్న కందకాలు అప్పట్లో గోల్కొండ కోటను శత్రుదుర్భేద్యంగా మార్చాయి. ఎంతో పొడవు, వెడల్పు గల ఈ కందకాలను దాటి కోట గోడల వరకు రావాలంటే శత్రు సైన్యాలకు సాధ్యం కాని పనిగా ఉండేది. అయితే అప్పటి మొఘల్ యువరాజు ఔరంగజేబు సైన్యాలకు సైతం దాటడం సాధ్యం కాకుండా ఈ కందకాలు నేటికి చరిత్రకు సాక్ష్యంగా ఉన్నాయి. అయితే కబ్జాదారుల దాటికి మాత్రం ఈ కందకాలు ఒక్కటిగా కనుమరుగవుతూ వస్తున్నాయి. మోతీదర్వాజా, బంజారా దర్వాజా, ఫతేదర్వాజాలను ఆనుకుని ఉన్న కందకాలు దశాబ్దాల క్రితమే కనుమరుగయ్యాయి. ఎండిలైన్స్, దుర్గానగర్ తదితర ప్రాంతాలలోని కందకాల్లో బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. ఇదిలా ఉండగా మోతీదర్వాజా వద్ద ఓ అరకిలో మీటర్ దూరం గతంలో ఈ కందకాలు అందరికి కానవచ్చేవి. అయితే ఈ కందకాలకు వారసులు పుట్టుకువచ్చి ఈ కందకాలు మావేనంటూ ఢంకా బజాయించి చెబుతున్నారు. దర్జాగా కందకాలను నింపేసి ఆ స్థలాలను డబ్బాలు వేసి అద్దెలకు ఇచ్చుకుంటున్నారు.

వ్యర్థాల డంపింగ్..

కందకాలను ఓ ప్రణాళికాబద్ధంగా కబ్జా చేసుకుంటున్నారు. వ్యర్థాలు, కూల్చిన భవనాల శిథిలాలు రాత్రిపూట తెచ్చి అక్కడ డంపింగ్ చేస్తున్నారు. కందకం పూర్తిగా నిండిన తర్వాత ఆ ప్రాంతంలో జేసీబీ పెట్టి చదును చేస్తున్నారు. మరికొందరు కబ్జాదారులు బరితెగించి మోతీదర్వాజా సమీపంలోని అహ్మద్ కాలనీ, అఫ్సర్ ఖాన్ కాలనీలలో జరుగుతున్న రోడ్డు పనుల సందర్భంగా ఏర్పడిన మట్టి కుప్పలు, సిమెంట్ దిబ్బెలను తెచ్చి సమీపంలోని కందకంలో వేస్తున్నారు. ఇటీవల ఓ కబ్జాదారుడు కందకాన్ని ఆనుకుని మూడు మడిగెలు నిర్మించి దర్జాగా కిరాయికి ఇచ్చుకున్నాడు. మురికి నీరు పోవడానికి మాత్రమే రెండు అడుగు వెడల్పు గల కందకమే నేడు కానవస్తుంది.


గోల్కొండ కోట ప్రహరీ పాదవునా మిగిలి ఉన్న కందకం

పర్యవేక్షణ లేక..

కాగా గోల్కొండ కోట కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉంది. అయితే గొల్కొండ కోటలో ఉండే అధికారులు తమ విధులను మరిచిపోతున్నారు. కోట ప్రహరీ చుట్టూ, కోట బయట గల చారిత్రక ప్రదేశాలు, ప్రాంతాలను పరిరక్షణ బాధ్యత తమది కాదంటూ వ్యవహరిస్తున్నారు. గోల్కొండ కోటకు వచ్చే పర్యాటకులకు టికెట్లు ఇవ్వడం మట్టుకే తమ బాధ్యత అన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. టన్నుల కొద్ది వ్యర్థాలు కందకాల్లో డంపింగ్ అవుతున్నా కూడా ఈ వైపు కేంద్ర ప్రభుత్వ అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఇదిలా ఉండగా పలు ప్రాంతాల్లో గోల్కొండ ప్రహరీని తమ ఇంటి గోడగా మార్చుకొని అక్రమ నిర్మాణాలు వెలిశాయి. కోట ప్రహరీతో పాటు మరో గోడలు నిర్మించి భారీగా నిర్మాణాలు చేపడుతున్నారు. మోతీదర్వాజా, జమాలి దర్వాజా తదితర ప్రాంతాలలో ప్రహరీ గోడను అనుకోని ఎన్నో నిర్మాణాలు వెలిశాయి. కోట గోడలు ఆక్రమణకు గురి కావడం చూస్తూ కూడా అధికారులు కనీసం ఉన్నతాధికారుల దృష్టికి కూడా తేవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏదేమైనా ఆరు తరాలకు వారసత్వ సంపదగా పరిరక్షించాల్సిన కందకాలు ఒకొక్కటిగా కనుమరుగు కావడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనం.

పరామర్శ



నాంపల్లి: ఇటీవల జరిగిన రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో మరణించిన బజార్‌ఘాట్ నివాసి మహ్మద్ అస్ఫాన్ కుటుంబసభ్యులను హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పరామర్శించారు. ఆదివారం ఆయన స్థానిక ఎంఐఎం నేతలతో కలిసి బజార్‌ఘాట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా అస్ఫాన్ కుటుంబ పరిస్థితి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంఐఎం పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని హామీ ఇచ్చారు. నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


చిన్నారెడ్డిని సన్మానిస్తున్న వెంకటేష్

గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం నూతన వైస్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ జి.చిన్నారెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేష్ ఆదివారం ఘనంగా సన్మానించారు. చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన చిన్నారెడ్డిని బేగంపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

‘రాజకీయ లబ్ధికోసమే కవిత అరెస్టు’


భాస్కర్

గోల్కొండ: ఎమ్మెల్సీ కవిత అరెస్టు పూర్తిగా బీజేపీ కుట్ర అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముత్యాల భాస్కర్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని ఆయన అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కవిత అరెస్టును ఒక సాకుగా చూపడానికి కేంద్ర ప్రభుత్వం ఈ దుశ్చర్యకు పాల్పడిందన్నారు. తెలంగాణలో బీజేపీ ఏనాటికి ప్రజాధరణ పొందలేదని ఆయన అన్నారు. రాజకీయ ప్రత్యేర్థులను కేంద్ర ప్రభుత్వ సంస్థల ద్వారా వేధింపులకు గురి చేయడం కేంద్ర ప్రభుత్వానికి కొత్తేమి కాదని ఆయన అన్నారు. ఈ కేసులో ఎమ్మెల్సీ కవిత నిర్దోషిగా తేలడం ఖాయమని ఆయన అన్నారు.

ప్రధాని మోదీ పథకాలపై అవగాహన



గోల్కొండ: హిందూ జనజాగరణ కార్వాన్ శాఖ, బీఐజీసీఐ సంయుక్తంగా మహిళల్లో యువత, మహిళల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్వాన్‌లోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. దేశంలో యువతతో పాటు మహిళా స్వశక్తితో కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోదీ అందిస్తున్న అనేక పథకాలపై పలువురు వక్తలు ఈ కార్యక్రమంలో వివరించారు. పథకాన్ని బట్టి రూ.10 నుంచి 2 కోట్ల రూపాయల వరకు కేంద్ర ప్రభుత్వం యువత, మహిళలకు రుణాలు ఇస్తుందని వక్తలు వివరించారు. ముద్రాలోన్, విశ్వకర్మ యోజన, స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఈఎంఈజీపీ, ఎడ్యుకేషన్ లోన్ ఏ విధంగా పొందవచ్చో వక్తలు వివరంగా తెలియపరిచారు.

‘నందు బిలాల్ అసమర్థతోనే ఓడిపోయాం’


మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గత అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన నందకిశోర్ వ్యాస్ బిలాల్ అసమర్థతతోనే గోషామహల్‌లో బీఆర్ఎస్ ఓటమి చెందిందని నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నందు బిలాల్ గెలుపు కోసం తామంతా ఎంతో కృషి చేశామని, ఆయన మాత్రం ఒంటెద్దు పోకడ పోతూ నిర్లక్ష్యంతోనే పార్టీ ఓడిపోయిందన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఆనంద్‌కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీలో నందకిశోర్ వ్యాస్ బిలాల్ చేరారని, కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ఆయన పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. నందు బిలాల్ పార్టీ వీడినా బీఆర్ఎస్‌కు ఏమీ నష్టం లేదన్నారు. బీఆర్ఎస్‌ను తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అహ్మద్, మహ్మద్ సలీమ్, మహ్మద్ గౌస్, అక్బర్ అలీ షరీఫ్, నరేష్ గౌడ్, జె.నాగేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నాగవంశం కులస్తుల ఆత్మీయ సమ్మేళనం



గోల్కొండ: నాగవంశం కులస్తులకు న్యాయం జరగకపోతే నిరసనలు వ్యక్తం చేస్తామని నాగవంశం సంక్షేమ సంఘం అధ్యక్షుడు భుగత సాంబశివ అన్నారు. ఆదివారం రాంసింగ్‌పురాలోని కేఎస్ ఫంక్షన్‌హాల్‌లో నాగవంశం కులస్తుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగవంశం కులస్తులు నాలుగు దశాబ్దాలుగా ప్రభుత్వ నిరాదరణకు గురవుతున్నారన్నారు. 2014లో ఉమ్మడి రాష్ట్రం విడిపోయిన సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం బీసీ జాబితా నుంచి 26 కులాలను తొలగించారన్నారు. ఇందులో నాగవంశం కులం కూడా ఒకటని ఆయన అన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో నాగవంశం కులాన్ని బీసీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చారన్నారు. మా కులంపై కరుణ చూపి ముఖ్యమంత్రి నాగవంశ కులాన్ని బీసీ జాబితాలో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం కార్యదర్శి తల్లాడ శ్రీనివాస్‌రావు, నగర ఉపాధ్యక్షులు గరికె లక్ష్మణ్, బాలకృష్ణ, తేజారావు, శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల అప్‌డేట్‌కు బ్రేక్

నాంపల్లి: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రజాపాలన దరఖాస్తుల అప్‌డేట్‌కు బ్రేక్ పడింది. ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా పేదల నుంచి ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించింది. అయితే ప్రభుత్వం స్వీకరించిన దరఖాస్తుల్లో అత్యధికంగా దరఖాస్తులు అప్‌డేట్ కాలేదు. దీంతో గృహ జ్యోతి పథకం కింద జీరో బిల్లు రాని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిరుపేదలు ఆందోళనలకు దిగడంతో ప్రభుత్వం వెంటనే స్పందించింది. రెండు వందల యూనిట్ల లోపు విద్యుత్‌ను వాడిన తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రజా పాలన దరఖాస్తులను అప్‌డేట్ చేసుకునే అవకాశం మళ్లీ కల్పిస్తున్నట్లుగా ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని మార్చి 13వ తేదీ నుంచి అన్ని వార్డుల్లో స్వీకరించేందుకు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా వార్డు కేంద్రాల్లో పేదల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అప్‌డేట్ కాని ప్రజలందరూ బారులుదీరి నిలబడ్డారు. ప్రజల నుంచి గతంలో ఇచ్చిన ప్రజాపాలన దరఖాస్తు రసీదు, కరెంట్ బిల్లు, తెల్ల రేషన్ కార్డు, ఆధార్‌కార్డును తీసుకుని అప్‌డేట్ చేశారు. అయితే శనివారం కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడంతో దరఖాస్తుల అప్‌డేట్ కార్యక్రమం నిలిచిపోయిందని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు.

19, 20 తేదీలలో సిటీ కళాశాలలో జాతీయ సదస్సు

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీలలో జాతీయ సదస్సు జరుగుతుందని ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ తెలిపారు. రసాయన శాస్త్రం–బహు శాస్త్రంతార పరిశోధన అవకాశాలు అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యం, లారస్ లాబ్స్, ఎస్ ఎస్ కె బయో సైన్సెస్ సహకారం అందిస్తున్నాయన్నారు. కెమిస్ట్రీ విభాగం అధ్యక్షుడు డా.ఏలూరి యాదయ్య సమన్వయం చేస్తున్న ఈ సదస్సులో రాష్ట్ర, రాష్ట్రేతర అధ్యాపకులు, ఆచార్యులు పాల్గొంటున్నారన్నారు. 19వ తేదీ ప్రారంభ సభను ఐఐసిటి సంచాలకులు డా.డి.శ్రీనివాస రెడ్డి ప్రారంభిస్తారన్నారు. ఈ సదస్సులో ప్రముఖ పరిశోధకులు ఆచార్య సీహెచ్. సుబ్రహ్మణ్యం, డా.కె.రాజేందర్ రావు, డా.ఎస్. రవికుమార్ రెడ్డి, డా.పి.దివాకర్ తదితరులు పాల్గొంటారన్నారు. ఇతర దేశాల నుంచి శాస్త్ర వేత్తలు ఆన్‌లైన్ లో పత్ర సమర్పణ చేస్తారన్నారు. డా.విప్లవ్ దత్ శుక్లా, డా.దయానంద్, వసంత, అనిల్ బూసి, డా.రత్న ప్రభాకర్, డా.జె.నీరజ, డా.రవి కుమార్, డా.శంకర్, డా.భాస్కర్ సదస్సు నిర్వహణలో సహకరిస్తారని కార్యక్రమం సమన్వయకర్త డా.యాదయ్య తెలిపారు.

‘మజ్లిస్ పార్టీని చిత్తుగా ఓడిస్తాం’


ప్రచారంలో పాల్గొన్న మాధవీలత

అబిడ్స్: పార్లమెంటు ఎన్నికల్లో మజ్లిస్ పార్టీని చిత్తుగా ఓడిస్తామని బీజేపీ అభ్యర్థి డాక్టర్ మాధవీలత పేర్కొన్నారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మైనార్టీ ఓట్లతో విజయం సాధిస్తూ మైనార్టీల అభివృద్ధిని విస్మరించారన్నారు. గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్కా కృష్ణా గుప్తాతో పాటు పలువురు నాయకులు అబిడ్స్ పరిసర ప్రాంతాల్లో ముమ్మర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ.. మతతత్వ పార్టీ అయిన మజ్లిస్‌ను ఓడిస్తే పాతబస్తీ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు పచ్చి అబద్ధాలు చెప్పే మజ్లిస్ పార్టీని నామరూపం లేకుండా చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మాధవీలత గెలుపునకు కృషి చేయాలి

జియాగూడ: హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మాధవీలత గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం నాంపల్లిలోని బీజేపీ అభ్యర్థి మాధవీలత కార్యాలయానికి వెళ్లి ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గం నుంచి అధిక శాతం ఓటు బ్యాంకు బీజేపీకి లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం ప్రధాన కార్యదర్శి నరేష్, గోల్కొడ జిల్ల బీజేవైఎం కార్యవర్గ సభ్యుడు సంతోష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన మాధవీలత


పల్లె చెరువు మైసమ్మకు బోనం సమర్పిస్తున్న మాధవీ లత

చాంద్రాయణగుట్ట: పాతబస్తీ కందికల్ గేట్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో పల్లె చెరువు కట్ట మైసమ్మ ఆలయంలో ఆదివారం సామూహిక బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగపుత్ర కులస్తులు తొట్టెలతో పాటు సంప్రదాయ రీతిలో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ బోనాల ఉత్సవాల్లో హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత హాజరై అమ్మవారికి బోనం సమర్పించారు. వచ్చే పార్లమెంట్‌లో బీజేపీని గెలిపించాలని ఆమె వారిని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు గంట శంకర్, బైరీ వినోద్, అంబటి ధన్‌రాజ్, గంట నందూ, నాస శ్రీనివాస్, గాండ్ల కృష్ణారావు, బుడుమని సత్యనారాయణ, ఆనందేష్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

గౌలిపురా: బీజేపీ యాకుత్‌పురా అసెంబ్లీ కన్వీనర్ గౌలికార్ ధీరజ్ లాల్ జన్మదిన వేడుకల్లో ఆ పార్టీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేసి నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానమంత్రిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఆదర్ల మహేష్, కొడీ సురేందర్, డొంకి యాదగిరి, జమాల్‌పూర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాధవీలతకు సన్మానం

యాకుత్‌పురా: బీజేపీ విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత పిలుపు నిచ్చారు. ఆదివారం ఆమె పాతబస్తీలో సుల్తాన్‌షాహిలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. వారి నివాసానికి వచ్చిన ఆమెను పాశం సురేందర్ సతీమణి అనిత శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్ అభివృద్ధికి మజ్లిస్ పార్టీ చేసిందేమి లేదన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు జమల్‌పూర్ చంద్రశేఖర్, సిద్దేశ్వర్ సింగ్ రాణా, కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోట జాతరను తలపించింది. ఆదివారం వేల సంఖ్యలో గోల్కొండ కోటకు భారీ ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. ఇంత పెద్ద సంఖ్యలో పర్యాటకులు రావడంతో బుక్కింగ్ కౌంటర్ ముందు వేల సంఖ్యలో పర్యాటకులు టికెట్ల కోసం బారులుతీరారు. మరోవైపు భారీ సంఖ్యలో పర్యాటకులు రావడంతో కోటలోని మెయిన్ గేట్‌తో పాటు సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. గోల్కొండ కోటలోని పలు ప్రాంతాలలో పర్యాటకులు సందడి చేశారు. యువకులు ఓ వైపు గోల్కొండ కోటలోని కట్టడాలను చూస్తూ మరోవైపు వారు సెల్ఫీలు దిగుతూ సంబరపడ్డారు.

యోగాతో ఆరోగ్యం



గోల్కొండ: యోగాతో ఎన్నో ఆరోగ్య సమస్యలను జయించవచ్చునని ప్రముఖ యోగా ఉపాసకుడు, మెహిదీపట్నం సంతోష్‌నగర్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధి ఈశ్వర్ జోషి అన్నారు. ఆదివారం ఉదయం సంతోష్‌నగర్ పార్కులో ఆయన మార్నింగ్ వాకర్స్‌తో కలిసి వాకింగ్ అనంతరం యోగాపై అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా యోగా చేస్తే ఎన్నో రుగ్మతలను జయించగలమని ఆయన అన్నారు.